# ఓం శ్రీ పరమాత్మనే నమః

# అథ ద్వాదశోధ్యాయః

# భక్తియోగః

అర్జున ఉవాచ:

1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే |

యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ||

అర్జునుడు అడిగాడు: శ్రీకృష్ణా! నీయొక్క సగుణస్వరూపమును ఉపాసన చేసిన భక్తులు కొంతమంది ఉన్నారు. నిన్ను నిర్గుణపరబ్రహ్మముగా ధ్యానించువారు మరికొందరు ఉన్నారు. వీరిద్దరిలో ఎవరు యోగవిదులు?

శ్రీ భగవానువాచ:

2. మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే |

శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ||

భగవంతుడు చెప్పాడు: నిత్యము నన్నే తమ మనస్సులలో నిలిపి, శ్రద్ధతో, రెండవ ఆలోచన లేకుండా, నన్ను ఉపాసన చేసే భక్తులే శ్రేష్ఠమైన యోగులు.

3. యే త్వక్షరమనిర్దేశ్యం అవ్యక్తం పర్యుపాసతే |

సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ||

4. సన్నియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః |

తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ||

అవ్యక్తుడనైన నన్ను ఎవరు ఉపాసన చేస్తారో వారు, ద్వంద్వాతీతులై, సర్వభూతములయందు ప్రేమను కలిగి, ఇంద్రియనిగ్రహము కలిగి, మనస్సునకు, వాక్కునకు అందని సర్వవ్యాప్తము, మాయాకారణము, అచలము, నిత్యసత్యము అయిన నిరాకార బ్రహ్మను ఉపాసించుచు, నన్నే పొందుతారు.

5. క్లేశోధికతరస్తేషాం అవ్యక్తాసక్త చేతసామ్ |

అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ||

సగుణోపాసన కంటే నిర్గుణోపాసన కష్టమైనది. దేహాభిమానం కలవారికి ఇది చాలా కష్టము. అధికారి అయితే ఇదే ఉత్తమము.

6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః |

అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ||

7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్ |

భవామి నచిరాత్ పార్థ! మయ్యావేశిత చేతసామ్ ||

పార్థా! ఎవరైతే అన్ని కర్మ ఫలములను నాకే అర్పించి, నన్నే పరమావధిగా నిర్ణయించుకొని ఏకాగ్రతతో ధ్యానిస్తారో, వారిని మృత్యురూపమైన సంసారమనే సముద్రము నుండి నేను దాటిస్తాను. శాశ్వతమైన నన్ను పొందేలా చేస్తాను.

8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ |

నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ||

మనస్సును, బుద్ధిని, నాయందే లగ్నము చేసి, ధ్యానము చేస్తే నీవు నాయందే ఎల్లప్పుడూ ఉంటావు.

9. అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ |

అభ్యాసయోగేన తతః మామిచ్ఛాప్తుం ధనంజయ ||

అర్జునా! నిశ్చలమైన భక్తితో మనస్సును లగ్నము చెయ్యలేకపోతే, అభ్యాసయోగముతో నన్ను పొందు ప్రయత్నమునైనా చేయవచ్చు.

10. అభ్యాసేప్యసమర్థోసి మత్కర్మపరమో భవ |

మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి||

ఇట్టి అభ్యాసము చేయుటకు నీవు సమర్థుడవు కాకపోయినచో భగవంతునికి ప్రీతికరములైన కర్మలను ఆచరించు. దీనివలన కూడా నీవు సిద్ధిని పొందగలవు.

11. అథైతదప్యశక్తోసి కర్తుం మద్యోగమాశ్రితః |

సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ||

అదీ చేయలేకపోతే, మనోనిగ్రహముతో నన్ను శరణు పొందు. నీవు చేయు సర్వకర్మ ఫలములను నాకే సమర్పించు.

12. శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే |

ధ్యానాత్కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్ ||

అభ్యాసము కంటే జ్ఞానము గొప్పది. జ్ఞానము కంటే ధ్యానము గొప్పది. ధ్యానము కంటే కర్మఫలపరిత్యాగము గొప్పది. సర్వసంగత్యాగము వలన ముక్తి లభిస్తుంది.

13. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ |

నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ||

14. సంతుష్ట స్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః |

మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ||

దేనియందు ద్వేషము లేనివాడు, మిత్రభావము కలవాడు, దయ కలవాడు, అహంకార మమకారములు లేనివాడు, క్షమాశీలుడు, నిత్యసంతోషి, ఇంద్రియనిగ్రహము కలవాడు, దృఢనిశ్చయము కలవాడు, మనస్సును, బుద్ధిని నాయందే ఉంచినవాడు, అయిన భక్తుడు నాకిష్టమైనవాడు.

15. యస్మాన్నో ద్విజతే లోకః లోకాన్నోద్విజతే చ యః |

హర్షామర్షభయోద్వేగైః ముక్తోయస్స చ మే ప్రియః ||

లోకములను తాను భయపెట్టక, తాను లోకములకు భయపడక, ఆనందము, విషాదము, భయము, సంక్షోభములు లేనివాడే నాకు ప్రియమైనవాడు.

16. అనపేక్ష శ్శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః |

సర్వారంభ పరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ||

కోరికలు లేనివాడు, పరిశుద్ధుడు, బాహ్యాభ్యంతర శౌచ సంపన్నుడు. పక్షపాత శూన్యుడు, సర్వ సకామకర్మలను విడిచిపెట్టినవాడు అయిన భక్తుడు నాకిష్టమైనవాడు.

17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి |

శుభాశుభపరిత్యాగీ  భక్తిమాన్ యస్స మే ప్రియః ||

ఎవరికైతే సంతోషము, దుఃఖము, ద్వేషము, శుభాశుభముల పట్ల సంగము ఉండవో, అట్టివాడు నాకిష్టమైనవాడు.

18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానాపమానయోః |

శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగ వివర్జితః ||

19. తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ |

అనికేత స్స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః ||

శత్రువులయందు మిత్రులయందు సమభావము కలవాడు, మానావమానములకు చలించనివాడు, సుఖదుఃఖములయందు సమానమైనవాడు, కోరికలు లేనివాడు, దొరికినదానితో తృప్తిపడేవాడు, మౌనము నందు ఇష్టము కలవాడు, సుస్థిరమైన చిత్తము గల భక్తుడే నాకిష్టమైనవాడు.

20. యే తు ధర్మామృతమిదం యథోక్తం పర్యుపాసతే |

శ్రద్ధధానా మత్పరమాః భక్తాస్తేతీవ మే ప్రియాః ||

ఎవరైతే నేను చెప్పిన ధర్మములను ఆచరిస్తూ, నన్నే స్తుతిస్తూ, విశ్వసిస్తూ, నన్నే నమ్మి, ఉపాసిస్తారో, వారే నాకు మిక్కిలి ప్రియమైనవారు.

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు, బ్రహ్మవిద్యాయాం, యోగశాస్త్రే, శ్రీకృష్ణార్జున సంవాదే, భక్తియోగోనామ ద్వాదశోధ్యాయః